సాక్షి
అనకాపల్లి
గురువారం । 3 । ఏప్రిల్ । 2025



అగ్ని ప్రమాదం

నక్కపల్లి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న వారపు సంతలో 40 తాటాకు పాకలు కాలి బూడిదయ్యాయి. 8లో

ఉష్ణోగ్రతలు

బుధవారం

		గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	:	34.8/22.4
చోడవరం	:	37.0/26.0



పుస్తకావిష్కరణ

సీతంపేట: డాక్టర్ రమేష్ ప్రసాద్ రావెళ్ల (యూఎస్ఏ) రచించిన 'ప్రవాస సాహిత్యం' వ్యాస సంపుటిని డా.రఘురామారావు ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

కాయకల్ప బృందం ఏరియా ఆస్పత్రి సందర్శన



ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న కాయకల్ప బృంద వైద్యులు

నర్సీపట్నం: కాయకల్ప అవార్డుల ఎంపిక కోసం వైద్యాధికారుల బృందం బుధవారం స్థానిక ఏరియా ఆస్పత్రిని సందర్శించింది. బృందం సభ్యులు సోనీ, వేణు ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఓపీ విభాగం, ఎమర్జెన్సీ వార్డు, ప్రసూతి విభాగం, బ్లడ్ బ్యాంక్, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, కిచెన్, మార్చురీ, ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. ఆయా విభాగాల పనితీరు, అందిస్తున్న సేవల వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ సుధా శారద, వైద్యుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం వార్డులను పరిశీలించిన బృందం సభ్యులు రోగుల నుంచి వివరాలు సేకరించారు.

మారేపల్లిలో భారీ గిరి నాగు

హడలెత్తించిన 14 అడుగుల సర్పం



భారీ గిరి నాగును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ కృష్ణ

దేవరాపల్లి: మారేపల్లి గ్రామంలో భారీ గిరి నాగు (కింగ్ కోబ్రా) హడలెత్తించింది. గ్రామానికి సమీపంలోని పామాయిల్ తోటలో బుసలు కొడుతుండటంతో స్థానిక రైతులు గమనించి భయాందోళనతో పరుగులు తీశారు. వెంటనే అటవీశాఖ అధికారుల ద్వారా స్నేక్ క్యాచర్ కృష్ణకు సమాచారం ఇవ్వడంతో.. అతను సుమారు అరగంటకు పైగా శ్రమించి చాకచక్యంగా పట్టుకున్నారు. దీంతో సమీప రైతులంతా ఊపిరి పీల్చుకున్నారు. తరచూ విషపూరిత గిరి నాగు సంచరిస్తుండటంతో స్థానిక రైతులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. పొలాల్లోకి వెళ్లాలంటే భయంతో వణికిపోతున్నారు. మూడు రోజుల క్రితం దేవరాపల్లి, రైవాడలో భారీ గిరి నాగులు పట్టుబడగా తాజాగా మారేపల్లిలో పట్టుబడటంతో స్థానిక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

దివ్యాంగులతో 'యూఎస్ నేవీ' ముచ్చట్లు



దివ్యాంగులతో కుందన్ గాజులు తయారు చేస్తున్న నేవీ అధికారులు

సీతంపేట: ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా అక్కయ్యపాలెంలోని ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీలోని దివ్యాంగులతో బుధవారం 25 మంది యూఎస్ నేవీ అధికారులు కాసేపు ముచ్చటించారు. దివ్యాంగ పిల్లలతో కలిసి అలంకరణ వస్తువులు, కుందన్ గాజులు, వేలాడదీసే వస్తువులు, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ వంటి తయారీలో పాలుపంచుకున్నారు. కాన్సులేట్ జనరల్ సెంధిల్ కుమార్ సహకారంతో సొసైటీ అధ్యక్షురాలు సుచిత్ర దివ్యాంగ పిల్లలకు నేవీ అధికారులను కలిసే అవకాశం కల్పించారు. పిల్లలను వారికి పరిచయం చేసి, వారిలోని నైపుణ్యాలను, వారి విజయాలను అధికారులకు వివరించారు. సొసైటీ సేవలను నేవీ అధికారులు కొనియాడారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు


తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు అదనంగా జనరల్, స్లీపర్ క్లాస్ కోచ్‌లను తాత్కాలికంగా జతచేస్తున్నారు. విశాఖపట్నం–బ్రహ్మపూర్–విశాఖపట్నం (18526/18525) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 2 జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను జతచేస్తున్నారు. విశాఖపట్నం–రాయ్‌పూర్–విశాఖపట్నం(58528/58527) పాసింజర్‌కు ఈ నెల 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌ను జతచేస్తున్నారు. విశాఖపట్నం–కోరాపుట్–విశాఖపట్నం (58538/ 58537) పాసింజర్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌ను జతచేస్తున్నారు. విశాఖపట్నం–బ్రహ్మపూర్–విశాఖపట్నం (58532/58531) పాసింజర్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను జతచేస్తున్నారు. విశాఖపట్నం–భవానీపట్నం–విశాఖపట్నం (58504/ 58503) పాసింజర్‌కు ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్‌లను జతచేస్తున్నారు.

ప్రతి పనికీ పైసా వసూల్

వెబ్‌ల్యాండ్ కాదు... డబ్బు ల్యాండ్

మ్యుటేషన్ల కోసం ముప్పతిప్పలు

దళారులతో రెవెన్యూ సిబ్బంది కుమ్మక్కు



నక్కపల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలు రెవెన్యూ లీలలతో అష్టకష్టాలు పడుతున్నారు. పైసలిస్తే గానీ ఏ పనీ జరగడం లేదు. మామూళ్లు ఇవ్వకపోతే రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసేందుకు సిబ్బంది సవాలక్ష కొర్రీలు వేస్తున్నారు. అదే సొమ్ము ముడితే తిమ్మిని బమ్మి చేయడానికైనా సిద్ధపడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వెబ్‌ల్యాండ్ డబ్బు ల్యాండ్‌గా మారింది. తహసీల్దార్ కార్యాలయాలు అక్రమాలకు అడ్డాగా నిలుస్తున్నాయి. అక్కడక్కడా నీతిమంతులు ఉన్నప్పటికీ చాలాచోట్ల అవినీతి రాజ్యమేలుతోంది.

ప్రతి పనికీ లంచమే...

వారసత్వం, లేదా కొనుగోలు చేసిన ఆస్తి పంపకాల ద్వారా సంక్రమించిన ఆస్తిని తమ పేరున మార్చుకుని పాసుపుస్తకాలు పొందేందుకు రైతులు లక్షలాది రూపాయలు ఇచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కూటమి పాలనలో రెవెన్యూ శాఖలో అవినీతి పరాకాష్టకు చేరుకుంది. ఎకరా భూమికి పాసు పుస్తకం జారీ చేయాలంటే రూ.25 వేలకు పైనే చెల్లించుకోవాల్సి వస్తోంది. ఎకరా భూమిని సర్వే చేసి సాగులో ఉన్నట్లు సరిఫికెట్ జారీ చేయాలంటే రూ.30 వేలు చెల్లించుకోవాల్సి వస్తోంది. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోను ఇదే పరిస్థితి నెలకొంది. విశాఖ సిటీకి ఆనుకుని ఉన్న పరవాడ, సబ్బవరం, ఆనందపురం, పెందుర్తి, పెదగంట్యాడ, అనకాపల్లి తదితర మండలాల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. రెండెకరాల భూమిని సర్వే చేసి పట్టాదారు పాసుపుస్తకం జారీ చేయాలంటే లక్షన్నర ముట్టజెప్పాల్సి వస్తోందని ఆయాప్రాంతాల రైతులు వాపోతున్నారు. పూర్వార్జితంగా దఖలు పడిన ఆస్తి విషయంలో కూడా మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే.



డిజిటల్ సైన్ దుర్వినియోగం

తహసీల్దార్ వద్ద గోప్యంగా ఉండాల్సిన డిజిటల్ సైన్ కొంతమంది సిబ్బంది, దళారులకు తెలిసిపోతోంది. రైతులకు సంబంధించిన భూముల వివరాలు, పేర్లు వెబ్‌ల్యాండ్‌లో మార్పులు చేర్పులు తొలగింపులకు ప్రతి తహసీల్దార్‌కు ఒక పాస్‌వర్డ్ కేటాయిస్తారు. దీన్ని ఉపయోగించి ఆయా మండలానికి చెందిన వెబ్‌ల్యాండ్‌ను ఓపెన్ చేసి ఇష్టానుసారం మార్పులుచేర్పులు చేయొచ్చు. ఒక భూమికి సంబంధించి లావాదేవీలు జరపాలనుకుంటే అసలు హక్కుదార్లను వెబ్‌ల్యాండ్‌ల నుంచి తాత్కాలికంగా తొలగించి వేరొక పేరు నమోదు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత మళ్లీ యధావిధిగా పాతరైతు పేరున మార్చేయవచ్చు. ఈ వెసులుబాటు వెబ్‌ల్యాండ్‌లో ఉంది. ప్రభుత్వభూమి అయినా సర్వే జిరాయితీగా చూపించి తమకు నచ్చిన వారి పేరున వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసే వెసులుబాటు ఉంది. తహసీల్దార్ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లందరూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే. దీంతో సిబ్బంది, దళారులు వీరితో కుమ్మక్కయి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఏడాది క్రితం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో పలు గ్రామాల్లో పలు భూములకు ఇలా రిజిస్ట్రేషన్‌లు జరిగాయన్న ప్రచారం జరుగుతోంది. దీన్ని ఉపయోగించుకుని గతంలో టీడీపీ ప్రభుత్వంలో వేంపాడు, అమలాపురం, మూలపర గ్రామాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను స్థానిక టీడీపీ నాయకులు రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కయి తమ పేరున నమోదు చేసుకున్నారు. కొండపోరంబోకు భూములను తమ పేరున వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయించుకుని పాసుపుస్తకాలు జారీ చేయించుకున్నారు. ఈ అక్రమాలు పత్రికల్లో రావడంతో ఒక డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, ఇద్దరు వీఆర్వోలు సస్పెన్షన్‌కు గురయ్యారు. అయినప్పటికీ స్థానిక రెవెన్యూ సిబ్బందిలో మార్పు రావడంలేదు.

తండ్రి పేరుతో ఉన్న భూమి కొడుకు పేరుతో మారాలంటే డబ్బులు.. భర్త మరణించాక ఆయన పేరున ఉన్న ఆస్తిని భార్య పేరున మార్చడానికి సైతం లంచాలు.. పట్టాదార్ పాస్ పుస్తకం కావాలంటే ఎకరానికి రూ.25-30 వేలు.. అదే బాగా విలువైన ప్రాంతాలైతే ఎకరానికి రూ.50 వేలకు పైమాటే.. అసలే అవినీతికి ఆలవాలమైన రెవెన్యూ శాఖ కూటమి ప్రభుత్వ పాలనలో మరింత ప్రజాకంటకంగా తయారైంది. గతంలో సీఎం చంద్రబాబునాయుడు హయాంలో ప్రవేశపెట్టిన వెబ్‌ల్యాండ్ విధానం అవినీతికి ఆస్కారం ఇస్తోంది. తహసీల్దార్ల డిజిటల్ సైన్ వారికి తెలియకుండానే అవకతవకలకు ఆమోద ముద్ర వేస్తోంది.


మ్యుటేషన్ ప్రక్రియ ఇలా...

పట్టాదారు పాసుపుస్తకం పొందాలంటే ఆన్‌లైన్లో దరఖాస్తు చేయాలి. 15 రోజుల తర్వాత వెబ్‌ల్యాండ్ పోర్టల్ ఓపెన్ అవుతుంది. తదుపరి వీటన్నింటిని పరిశీలించి సక్రమంగా ఉంటే వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసి ఖాతా నెంబరు కేటాయించి, పట్టాదారు పాసుపుస్తకం కోసం సిఫార్సు చేస్తారు. కాని ఇక్కడ రెవెన్యూ సిబ్బంది డబ్బుల కోసం సర్వే రిపోర్టు కావాలంటున్నారు. సర్వే కోసం ప్రభుత్వానికి రూ.400 చెల్లించాలి. తర్వాత సర్వే చేయడానికి వచ్చే సర్వేయర్‌కు ఎకరాకు రూ.20 వేలు చెల్లిస్తే తప్ప కొలతకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే రిపోర్టు ఉన్నప్పటికీ వీఆర్వోలకు, ఆర్ఐలకు వేలాది రూపాయలు ఇస్తేనే తప్ప మ్యుటేషన్ చేయడం లేదు. ఏవో సాకులు చూపి రోజుల తరబడి తిప్పిస్తున్నారని 15 రోజుల్లోగా మామూళ్లు అందకపోతే 15 రోజుల తర్వాత మీ దరఖాస్తు గడువు తీరిపోయింది మళ్లీ దరఖాస్తు చేయాలని చెబుతున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. మళ్లీ దరఖాస్తు చేసి కార్యాలయాల చుట్టుతిరిగే తీరిక, ఓపిక లేని వారు రెవెన్యూ సిబ్బంది అడిగిన మామూళ్లు ఇచ్చుకుంటున్నారు లేదా దళారులను ఆశ్రయించి పనులు చేయించుకుంటున్నారు.



మాయలు అన్నీ ఇన్నీ కావు

ప్రస్తుతం క్రయవిక్రయాలకు వెబ్‌ల్యాండ్ కీలకంగా మారింది. ఆన్‌లైన్‌లో రైతు పేరు నమోదై ఉంటే చాలు రిజిస్ట్రేషన్ జరిగిపోతోంది. పట్టాదారు పాసుపుస్తకాలు, దస్తావేజులతో పనిలేదు. గత నెలలో నక్కపల్లి మండలం వేంపాడులో ఒక రైతుకు చెందిన 7 ఎకరాల భూమిని వేరొకరి పేరున ఎటువంటి ఆధారాలు లేకుండానే వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేశారు. దీని ఆధారంగా ఈ భూమిని ఒక జనసేన పార్టీ నాయకుడు కొనుగోలు చేశాడు. విషయం తెలిసి వారసులు లబోదిబోమంటూ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు. ఈ భూమిని కొనుగోలు చేసిన వ్యక్తికి తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు. ఇంతలో కొనుగోలు చేసిన వ్యక్తి వెబ్‌ల్యాండ్‌లో వన్ బి, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను ఆధారంగా చేసుకుని కోర్టును ఆశ్రయించాడు. ప్రస్తుతం ఈ భూమి వివాదంలో పడింది.



రెవెన్యూ సేవల్లో జాప్యం ఉండరాదు



రెవెన్యూ సేవలపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

- మ్యుటేషన్ల తీరుపై ఓ కన్నేసి ఉంచండి
- ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం
- తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

తుమ్మపాల: రెవెన్యూ సేవల్లో జాప్యం ఉండకూడదని, సేవలకు సంబంధించిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ శాఖకు సంబంధించిన రీసర్వే, మ్యుటేషన్లు, ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ, నీటితీరువా వసూలు వంటి అంశాలపై తహసీల్దార్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ సేవలకు సంబంధించిన దరఖాస్తులపై గడువు లోపల చర్యలు తీసుకోవాలన్నారు. రీసర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. కొన్ని మండలాల్లో ఆటో మ్యుటేషన్లు పెరగడం, ఎక్కువ మ్యుటేషన్లను తిరస్కరించడంపై నివేదిక అందజేయాలన్నారు. దీనిపై రెవెన్యూ డివిజనల్ అధికారులు రోజువారీ పర్యవేక్షణ చేయాలన్నారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో 2019 అక్టోబర్ 15 నాటికి ఇళ్లు కట్టుకొని, ప్రస్తుతం నివాసముంటూ, ఇంటికి సంబంధించిన ఆధార పత్రాలు కలిగి, ఎక్కడా ఇల్లు లేని వారికి ప్రభుత్వం కల్పించిన క్రమబద్ధీకరణ పథకానికి సంబంధించిన దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ఆయకట్టు భూములకు నీటి తీరువా వసూలు చేయాలని, జిల్లాలో సుమారు రూ.17 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చాలని, అందుకుగాను నాటుసారాకు సంబంధించిన సమాచారాన్ని గ్రామ అధికారులు ఎక్సైజ్ శాఖకు అందించాలని, ఎక్సైజ్ శాఖ దాడులు చేసినప్పుడు వారికి సహకరించాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి మాట్లాడుతూ రెండో విడత రీసర్వే చేపడుతున్న గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని, ముందుగా భూ యజమానులకు నోటీసులు అందజేయాలని తెలిపారు. సర్వేకు అదనపు సిబ్బంది అవసరమైతే కేటాయిస్తామన్నారు. డీఆర్వో వై.సత్యనారాయణరావు, సర్వే ల్యాండ్ రికార్డ్ సహాయ సంచాలకులు గోపాలకృష్ణ, కె.కె.ఆర్.సి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎస్.మూర్తి, పాల్గొన్నారు.

తప్పుడు కేసులు పెడితే భయపడేదిలేదు

- మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్
- వైఎస్సార్‌సీపీ నేత కర్రి శ్రీనివాసరావు అక్రమ అరెస్టుపై ధ్వజం
- అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా



శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ నేత, బీసీ కార్పొరేషన్ స్టేట్ మాజీ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావుపై రాజకీయ కక్షతో స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు పోలీసు కేసులు పెట్టించడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ధ్వజమెత్తారు. నంద్యాల పోలీసులు కర్రి శ్రీనివాసరావును తీసుకువెళ్లిన నేపథ్యంలో ఆయన బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ వేధింపులకు గురైన వైఎస్సార్‌సీపీ నేతలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. గత ఫిబ్రవరి 24న కర్రి శ్రీనివాసరావు సోదరుడు సత్యనారాయణ ఇంటిని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధికారులతో కూల్చివేయించారన్నారు. ఈ సందర్భంగా జరిగిన అన్యాయంపై, అయ్యన్నపాత్రుడు వేధింపులపై శ్రీనివాసరావు ఆవేదన వెలిబుచ్చారన్నారు. దీనిని సహించలేని అయ్యన్నపాత్రుడు అతనిపై నాలుగు చోట్ల పోలీసు కేసులు పెట్టించారన్నారు. దీనిలో భాగంగానే నంద్యాల జిల్లా జాలదుర్గం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందని, ఎటువంటి నోటీసు ఇవ్వకుండా బుధవారం ఉదయం 8 గంటలకు నర్సీపట్నం టౌన్ పోలీసులు శ్రీనివాసరావును తీసుకువెళ్లారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టినంత మాత్రాన ఏమాత్రం భయపడేది లేదని మాజీ ఎమ్మెల్యే గణేష్ హెచ్చరించారు. ఆయన వెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, లీగల్ సెల్ ప్రతినిధి మాకిరెడ్డి బుల్లిదొర తదితరులు ఉన్నారు.

విశాఖ నగరిపై నెత్తుటి మరకలు

8లో

ఆకతాయిల ఆట కట్టించే 'శక్తి టీమ్స్'



ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

- 30 మంది సభ్యులతో ఐదు బృందాలు
- మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు

అనకాపల్లి: జిల్లాలో మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు, మహిళల రక్షణకు ప్రత్యేక శక్తి టీమ్స్‌ను, శక్తి యాప్‌ను ఏర్పాటు చేశామని ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. తమ కార్యాలయంలో బుధవారం పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'శక్తి' యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా టీమ్స్‌ను నియమించామని చెప్పారు. రాష్ట్రంలో మహిళల పట్ల దాడులు, అఘాయిత్యాలు, వేధింపులు లేకుండా చేసేందుకు ప్రత్యేకంగా ప్రభుత్వ ఆదేశాలతో 'శక్తి టీమ్స్'ను జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు. ఈ టీమ్ సభ్యులు జిల్లాలోని కళాశాలలు, ప్రధాన కూడళ్లను (హాట్ స్పాట్స్‌ను) మఫ్టీలో సందర్శించి, మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నం పట్టణాలలో ఆరుగురు పోలీసు సిబ్బందితో ఐదు బృందాలుగా మొత్తం 30 మందితో శక్తి టీమ్స్ ఏర్పాటు చేశామని, ఒక్కొక్క బృందానికి ఎస్ఐ నాయకత్వం వహిస్తారని, మఫ్టీలో విధులు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. ఆపద సమయంలో ఈ యాప్‌కు వచ్చే ఎస్ఓఎస్ కాల్స్, డయల్ 112/100 కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటన స్థలానికి చేరుకొని సమస్యలను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతాయన్నారు. బృందాల పనితీరును అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ పర్యవేక్షిస్తారని, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఇ.శ్రీనివాసులు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని ఆయన పేర్కొన్నారు.

మహిళలకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్ గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించి, వారి మొబైల్స్‌లో రిజిస్ట్రేషను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మనోజ్‌కుమార్, శక్తి టీమ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు గొంతు విప్పిన గురువులు

ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన



కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల నిరసన

తుమ్మపాల: ఉద్యోగుల 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, డీఏ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ బోయిన చిన్నారావు మాట్లాడుతూ 11వ పీఆర్సీ గడువు ముగిసి 21 నెలలు పూర్తయినా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడం వలన రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లలో ఆందోళన నెలకొందని, కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు గడచినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. 2023 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం మెమో నం: 57 ద్వారా పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలన్నారు. ఫ్యాప్టో సెక్రెటరీ జనరల్ యేశపోగు సుధాకర్‌రావు మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలని, జీవో నెం.117 రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మెమో నెం.57 ఉత్తర్వుల ద్వారా 2004 ఏడాదికి ముందున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పోలీసులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి, సీపీఎస్ ఉద్యోగులకు డీఏను 90 శాతం నగదు రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యను విధ్వంసం చేసిన జీవో నెం.117ను రద్దు చేయాలని, నూతన జాతీయ విద్యా విధానంలో సైతం స్థానిక భాషలో బోధన చేయాలని సూచించినప్పటికి తెలుగు మీడియంను పునరుద్ధరించడానికి కూటమి ప్రభుత్వం అంగీకరించకపోవడం బాధాకరమన్నారు. నిరసన ప్రదర్శన అనంతరం ఉద్యోగులు తమ డిమాండ్లపై కలెక్టర్ విజయ కృష్ణన్‌కు మెమొరాండం అందించారు. ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్‌లు ఎస్.దుర్గాప్రసాద్, ఆచంట రవి, వై.జానకీరామ్‌నాయుడు, కార్యవర్గ సభ్యులు వత్సవాయి శ్రీలక్ష్మి, కె.పరదేశి, మట్ట శ్రీనివాసరావు, కోశాధికారి కె.ఎస్.ఎస్. ప్రసాద్, రాష్ట్ర ఏపీటీఎఫ్ ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్, ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు బి.వెంకటపతిరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫ్రిజ్ ప్లగ్ తీస్తుండగా షాక్ కొట్టి వ్యక్తి మృతి

యలమంచిలి రూరల్: ఇంట్లో రిఫ్రిజిరేటర్ ప్లగ్‌ను విద్యుత్ స్విచ్ బోర్డు నుంచి తీస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బయ్యవరం గ్రామ శివారు ఎర్రమెరకలో చోటు చేసుకుంది. బుధవారం ఉదయం జరిగిన ఈ దుర్ఘటనలో గ్రామానికి చెందిన ఎల్లపు చిన్న అప్పారావు(56) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో మృతుని కుటుంబంలో విషాదం అలముకుంది. ఈ ఘటనపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ పోలీసులు విలేకరులకు తెలిపారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం, వజ్రగాడ గ్రామానికి చెందిన తమరాన రాజుబాబు(50) జోగునాథునిపాలెం మెయిన్ రోడ్డు పక్కన చనిపోయి ఉన్నాడని టౌన్ సీఐ గోవిందరావు తెలిపారు. మృతుడు మద్యానికి బానిసయ్యాడని బంధువులు తెలిపారు. అతిగా మద్యం సేవించడం వల్లనే చనిపోయాడని బంధువులు తెలిపారని సీఐ వివరించారు. కుటుంబ సభ్యులు ఎలాంటి అనుమానం వ్యక్తం చేయకపోవడంతో సహజ మరణంగానే భావించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని సీఐ తెలిపారు.

రామాలయంలో రామచిలుక



కె.జె.పురం రామాలయం గర్భ గుడిలో తలుపు మీద వాలి ఉన్న రామచిలుక

మాడుగుల రూరల్: కె.జె.పురం రామాలయంలో ఒక రామ చిలుక ఆలయ గర్భగుడిలో తలుపు మీద వాలింది. ఆలయంలో సీతారామచంద్ర మూర్తులకు పెట్టే పండ్లు తింటూ అక్కడే ఉంటున్నది. ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదు.. కానీ శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా ఈ రామచిలుక గర్భగుడిలో సంచరించడాన్ని భక్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు రాత్రి 7 గంటల నుంచి 11 గంటలు వరకు భజన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

విశాఖ నగరిపై నెత్తుటి మరకలు

- వరుస హత్యలతో ప్రజల్లో భయాందోళనలు
- మహిళలపై అఘాయిత్యాలతో పెరుగుతున్న అభద్రతా భావం
- తల్లీ కూతుళ్లపై ప్రేమోన్మాది ఘాతుకంతో మరోసారి ఉలిక్కిపడ్డ నగరం
- కూటమి సర్కారు హయాంలో విశోకపట్నంగా మారిన విశాఖ



సాక్షి, విశాఖపట్నం/అల్లిపురం: ప్రశాంత విశాఖ నగరం నెత్తుటి మరకలతో ఎర్రబడుతోంది. వరుస నేరాలతో ఉలిక్కి పడుతోంది. తరచూ లైంగికదాడులు, హత్యలు, దొంగతనాలు, దాడుల భయం నీడలా వెంటాడుతోంది. సిటీ ఆఫ్ డెస్టినీగా పిలుచుకునే సుందర విశాఖ నగరంలో రోజూ ఏదో ఒక నేర నమోదుతో ప్రజల్లో కలవరం మొదలైంది. కూటమి పాలనలో అరాచక శక్తులకు, అడ్డాగా మారిందనే ఆందోళన అందరిలోనూ కనిపిస్తోంది. ఒక విషాదం తర్వాత మరొకటి జరుగుతుండటంతో నగరంలో ఏం జరుగుతుందోనన్న భయం అందరిలోనూ నెలకొంది. మూడు వారాల క్రితం పెద గదిలిలో ఐదు నెలల కుమార్తెని కన్నతల్లి హత్య చేసిన ఘటన మరవక ముందే.. కొమ్మాదిలో ఘోరం అందర్నీ కలచివేసింది. పెళ్లికి అంగీకరించడం లేదనే కోపంతో ప్రేమోన్మాది నవీన్.. విచక్షణా రహితంగా చెలరేగిపోయాడు. మిట్ట మధ్యాహ్నం రెండు చాకులతో తల్లీ కూతుళ్లపై ఉన్మాదంతో చెలరేగిపోయాడు. ఈ దాడిలో తల్లి మృత్యుఒడికి చేరుకోగా.. కుమార్తె ప్రాణాలతో పోరాడుతోంది. ఈ ఘటన విశాఖనే కాదు యావత్ రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఉమ్మడి విశాఖ జిల్లాలోనే హోం మంత్రి ఉన్నా.. మహిళల భద్రత గాల్లో దీపంలా మారిపోయింది. శాంతి భద్రతలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది.

అంతలోనే మరో అమానుషం

ప్రేమోన్మాది ఘాతుకం జరిగిన కొద్ది గంటల్లోనే మరో అమానుష ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మతిస్థిమితం లేని మహిళకు చెరకు రసం ఇస్తానని చెప్పి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఓ దుండగుడు అత్యాచారం చేశాడు. మహిళ తల్లిదండ్రులు ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకొని పోలీసుల్ని ఆశ్రయించారు. గత నెల 26న 8 ఏళ్ల చిన్నారిపై పలుమార్లు లైంగిక వేధింపులకు పాల్పడిన కీచకుడి ఘటన యావత్ నగరాన్ని షాక్‌కు గురిచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెరుగుతున్న నేరాలతో నగర ప్రజలు భయంభయంగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

అప్పట్లో 'దిశ'తో రక్షణ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దిశ యాప్ ద్వారా మహిళలకు రక్షణ కల్పించింది. యాప్‌పై పూర్తి అవగాహన కల్పించటంతో మహిళలు యాప్‌ను వినియోగించుకుని రక్షణ పొందేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దిశ చట్టాన్ని నీరుగార్చారు. దీంతో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒక మహిళ హోం మంత్రిగా ఉండి కూడా మహిళలపై దాడులు జరుగుతున్నా పట్టించుకోక పోవటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం మాటలతోనే సరిపెడుతున్నారు తప్ప క్షేత్రస్థాయిలో శాంతిభద్రతలు కొరవడ్డాయని ఆందోళన వ్యక్తమవుతోంది. మహిళలు ఒంటరిగా ప్రయాణించాలన్నా, ఎక్కడికైనా వెళ్లాలన్నా భయపడుతున్నారు. మహిళ రక్షణ కోసం ఉపన్యాసాలు ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరుస ఘటనలతో బెంబేలు

ఒకప్పుడు శాంతిభద్రతలకు నెలవుగా మారిన విశాఖ వరుస ఘటనలతో వణికిపోతుంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మహిళలపై వరుస దాడులతో నగర ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పది నెలల కాలంలో వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

- మూడు రోజుల క్రితం డ్యాన్సర్లు అయిన భార్యాభర్తలు మధ్య జరిగిన గొడవలో.. భర్త చేసిన దాడిలో భార్య గాయపడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.
- మార్చి 31న మధురవాడ వాంబేకాలనీలో ఐదేళ్ల చిన్నారిపై వ్యాయామ ఉపాధ్యాయుడు లైంగికదాడికి పాల్పడ్డాడు.
- మార్చి 29న తండ్రిపై కొడుకు బ్లేడ్‌తో దాడి చేసి హత్య చేసిన ఘటన ఆరిలోవలో చోటుచేసుకుంది.
- మార్చి 28న బర్మా క్యాంపు సమీపంలో హనుమంతరావు అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు చెట్టుకు కట్టి హత్య చేశారు.
- మార్చి 27న సాలూరుకి చెందిన ఐశ్వర్య అనే యువతిని రాంబాబు అనే వ్యక్తి విశాఖలో హత్య చేసి సాలూరు ప్రాంతంలో చెట్టుకు వేలాడదీసి ఆత్మహత్యకు పాల్పడినట్లు చిత్రీకరించాడు.
- మార్చి 20న గాజువాక శ్రీనగర్‌లోని ఇంట్లో జరిగిన దొంగతనంలో 15 తులాల బంగారాన్ని అపహరించారు.
- ఫిబ్రవరి 28న ఐదేళ్ల బాలికపై ఓ షాప్ సెక్యూరిటీ గార్డ్ మేడమీదకు తీసుకెళ్లి అఘాయిత్యం చేసేందుకు ప్రయత్నించాడు. బాలిక కేకలు వెయ్యడంతో స్థానికులు ఈ దారుణాన్ని అడ్డుకున్నారు.
- ఫిబ్రవరి 5న హెచ్‌బీకాలనీ సింహాద్రిపురంలో పదేళ్ల బాలికపై 35 ఏళ్ల గణేష్ అనే వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు.
- మార్చి 2న ద్వారకాపోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న ఇంటిని పగలగొట్టి 30 తులాల బంగారం, రూ.45 వేల క్యాష్ చోరీకి పాల్పడ్డారు.
- మార్చి నెలలో అంగడిదిబ్బ ప్రాంతానికి చెందిన మహిళను ఫైనాన్స్ వ్యాపారులు వేధిస్తుండటంతో అప్పు ఇచ్చిన వారి ఇంట్లోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడింది.
- జనవరిలో పీఎం పోలీస్ స్టేషన్ పరిధిలో మిథిలాపురి వుడా కాలనీలో ఒక మహిళను నడిరోడ్డుపై జుట్టుపట్టుకుని ఈడ్చుకెళ్లిన ఘటన సంచలనం రేపింది.



కొమ్మాదిలో జరిగిన సంఘటన : హత్యకు గురైన తల్లి లక్ష్మి మృతదేహం

ఫ్లైఓవర్ వద్దంటూ కలెక్టరేట్ వద్ద నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న అచ్చుతాపురం రోడ్డు విస్తరణ బాధితులు

తుమ్మపాల: అనకాపల్లి – అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భాగంగా అచ్చుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం నిరుపయోగమని, రోడ్డు అభివృద్ధిలో ఫ్లైఓవర్ డిజైన్‌ను రద్దు చేయాలంటూ అచ్చుతాపురం, దుప్పిటూరు గ్రామస్తులు బుధవారం కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వినతిపత్రం అందించి గేటు వద్ద నిరసన తెలిపారు. విశాఖపట్నం వైపు నుంచి బొగ్గు, ఇతర వాహనాల కోసం వచ్చే కంటైనర్లు, ట్యాంకర్లు, చాలా మంది ఉద్యోగుల రాకపోకలకు నూతనంగా ఏర్పాటు చేసే ఫ్లైఓవర్ ఉపయోగపడదని, యలమంచిలి హైవే బైపాస్ నుంచి వచ్చే లారీలు, హెవీ గూడ్స్, నేవల్ బేస్ వాహనాలకు కూడా ఉపయోగం ఉండని గ్రామస్తులు చెబుతున్నారు. కేవలం 15 నుంచి 20 శాతం మంది ఉద్యోగులు, వాహనాల కోసం మాత్రమే ఫ్లై ఓవర్ వేయడం ప్రభుత్వ నిధులు వృథా చేయడమే అన్నారు. గాజువాక రోడ్డు అప్పన్నపాలెం జంక్షన్ నుంచి ఎస్ఈజెడ్ పరిశ్రమల ప్రవేశం వరకు 100 అడుగుల మేర ప్రతిపాదిత రింగ్‌రోడ్డు విశాఖపట్నం రోడ్డు వైపు నుంచి నిర్మిస్తే అచ్యుతాపురం జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య పూర్తిగా తగ్గుతుందన్నారు. సెజ్ పరిశ్రమల తరలింపునకు గతంలో ప్రతిపాదించిన నాలుగు ఔటర్ రింగ్ రోడ్లను అభివృద్ధి చేస్తే అచ్చుతాపురంలో ట్రాఫిక్ సమస్య కూడా తగ్గుతుందని, ఆ రోడ్ల వల్ల అచ్యుతాపురం పట్టణం మరింత అభివృద్ధి చెంది సంపూర్ణ నివాసయోగ్యమైన సుందర నగరంగా రూపుదిద్దుకుంటుందన్నారు. ముఖ్యంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న భవన యజమానులు, నిర్వాసిత కుటుంబాల నుంచి కనీస అభిప్రాయం కూడా తీసుకోకుండా యుద్ధప్రాతిపదికన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అయ్యే ఖర్చులో 25శాతం అచ్యుతాపురం పట్టణం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల్లో గతంలో ప్రతిపాదించిన నాలుగు ఔటర్ రింగ్ రోడ్లు నిర్మిస్తే ప్రభుత్వ సొమ్ము వృథా కాకుండా నిజమైన అభివృద్ధి జరుగుతుందన్నారు.

నక్కపల్లి వారపు సంతలో అగ్ని ప్రమాదం

- కాలి బూడిదైన 40 తాటాకు పాకలు
- రూ.35 లక్షల ఆస్తి నష్టం
- వసతి కోల్పోయిన చిరు వ్యాపారులు
- ఇక్కడ ప్రతి వారం రూ.2 కోట్ల ఎండు చేపల వ్యాపారం



వారపు సంతలో అగ్నికి ఆహుతవుతున్న పాకలు

నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న వారపు సంతలో బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్క సారిగా మంటలు ఎగిసిపడడంతో సంతలో ఉన్న తాటాకు పాకలన్నీ కాలిబూడిదయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించినా మంటలను అదుపు చేయలేకపోయారు. వారపుసంతను ఆనుకుని అగ్నిమాపక కేంద్రం ఉన్నప్పటికీ అదే సమయంలో సారిపల్లిపాలెంలో గడ్డివాముకు నిప్పు అంటుకుందని సమాచారం రావడంతో వాహనాన్ని తీసుకుని వెళ్లడంతో ఇక్కడ అగ్ని ప్రమాదాన్ని వెంటనే అదుపు చేయలేకపోయారు. ప్రమాదం విషయం తెలుసుకుని హుటాహుటిన ఫైర్ సిబ్బంది వారపు సంత వద్దకు వచ్చే సరికే సర్వం బూడిదయింది. మిగిలిన సిమెంట్ రేకుల షెడ్లకు మంటలు వ్యాపించకుండా మంటలు అదుపు చేశారు. సంతలో సుమారు 40కి పైనే తాటాకు పాకలు కాలిబూడిదయ్యాయి. ఆస్తి నష్టం రూ.35 లక్షలు పైనే ఉంటుందని అంచనా. ప్రతి శుక్ర, బుధవారాల్లో ఇక్కడ వారపు సంత జరుగుతుంది. శుక్రవారం జరిగే నక్కపల్లి సంత ఎండు చేపల వ్యాపారానికి ప్రసిద్ధి. ప్రతి వారం సుమారు రూ.2కోట్ల మేర ఎండు చేపల వ్యాపారం జరుగుతుంది. నక్కపల్లి మండలంలో ఉన్న మత్స్యకారులతోపాటు పాయకరావుపేట, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలకు చెందిన మత్స్యకారులు ఎండు చేపలను ఇక్కడ నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. పెద్ద పెద్ద వ్యాపారులు సంత జరిగే శుక్రవారం ముందురోజే ఇక్కడకు చేరుకుని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తాటాకు పాకలు, షెడ్లలో తమ సరుకును భద్రపరుచుకుంటారు. ప్రతి శుక్రవారం ఇక్కడ కూరగాయాల సంత కూడా జరుగుతుంది. చుట్టుపక్కల గ్రామాల వారు తాము పండించిన తాజా కూరగాయాలను తెచ్చి టోకుగానూ, రిటైల్‌గానూ విక్రయిస్తారు. వీటితోపాటు మసాలా దినుసులు, నర్సరీలు తదితర వ్యాపారాలు కూడా జరుగుతాయి. ప్రతి బుధవారం పశువుల సంత జరుగుతుంది. వీరికి కూడా ఈ పాకలు వసతి నిచ్చేవి. ఈ వారపు సంత నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీ, నక్కపల్లి మండల పరిషత్ వారు సంయుక్తంగా నిర్వహిస్తుంటారు. శుక్ర, బుధవారాల్లో ఆశీలు రూపంలో సుమారు రూ.25 లక్షల ఆదాయం లభిస్తుంది. ఈ నిధులను సంతలో మౌలిక సదుపాయాల కల్పన కోసం వినియోగిస్తారు. వ్యాపారులే ఇక్కడ ఈ తాటాకు పాకలను తమ సొంత నిధులతో నిర్మించుకుంటారు. అగ్ని ప్రమాదం కారణంగా వీటిని పునఃనిర్మించుకోడానికి వ్యయప్రయాసలు పడాల్సి వస్తుందని వ్యాపారులు ఆవేదన చెందారు. తాటాకు పాకలనుంచి మంటలు వ్యాపించడంతో పక్కనే ఉన్న సిమెంట్ రేకుల షెడ్లకు కూడా నష్టం వాటిల్లింది. దగ్ధమైన పాకలను ప్రభుత్వమే పునఃనిర్మించాలని కోరుతున్నారు. సంఘటన స్థలాన్ని వైస్ ఎంపీపీ వీసం నానాజీ, మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొప్పిశెట్టి కొండబాబు, వార్డు సభ్యులు అల్లాడ కొండ తదితరులు సందర్శించారు.



మంటలు అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం

అనకాపల్లి: స్థానిక అనకాపల్లి రైల్వే స్టేషన్ 2,3 ప్లాట్‌ఫార్లంలు మధ్యలో రైల్వే ట్రాక్‌పై సుమారు 65 సంవత్సరాలు వృద్ధురాలు గుర్తు తెలియని రైలు నుంచి మంగళవారం జారిపడిపోవడంతో అటుగా వెళ్లిన ప్రయాణికులు గుర్తించి రైల్వే స్టేషన్ మేనేజర్‌కు సమాచారం ఇచ్చారు. ఆమెను హుటాహుటీన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధురాలు బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ టిఆర్.లక్ష్మి చెప్పారు. మృతురాలు ఐదడుగుల ఎత్తు, తెల్ల జుత్తు కలిగి ఉంది. పింక్ కలర్ చీర, నీలం రంగు బ్లౌజ్, తెలుపు నలుపు చొక్కా ధరించి ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రిలో భద్రపర్చడం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలకు 7382058996 నంబరును సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

లారీ ఢీకొని మత్స్యకారుడి దుర్మరణం



రేగుపాలెం హైవే కూడలి వద్ద బైక్‌ను ఢీకొన్న లారీ

యలమంచిలి రూరల్: మండలంలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై రేగుపాలెం హైవే కూడలి వద్ద బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో రాంబిల్లి మండలం వాడనర్సాపురం గ్రామానికి చెందిన మత్స్యకారుడు ఎరిపిల్లి దానయ్య(49) అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువుల ఇంటికి వెళ్లిన దానయ్య తిరుగు ప్రయాణంలో తుని వైపు నుంచి అనకాపల్లి వైపు వెళ్తుండగా రేగుపాలెం సమీపంలో దానయ్య నడుపుతున్న ద్విచక్రవాహనాన్ని అదే దిశలో వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టగా దానయ్య తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. దానయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహమైంది. భార్య చిట్టెమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన యలమంచిలి రూరల్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఫార్మా పరిశ్రమల్లో నియామకాలకు ఇంటర్వ్యూలు

అచ్యుతాపురం రూరల్: లైఫ్ సైన్సెస్ సెక్టర్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 5న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా మెకానికల్, ఎలక్ట్రికల్, బీఎస్సి కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ లైఫ్ సైన్స్ 2024లో పూర్తయిన విద్యార్థులకు ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. ఎంపికైన విద్యార్థులకు విజయవాడలో మూడు నెలల శిక్షణ అనంతరం ఫార్మా పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నారన్నారు. మరిన్ని వివరాలకు 9701241753 సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వార్డు సభ్యుడి మృతి



మృతి చెందిన మణిబాబు

మాకవరపాలెం: రోడ్డు ప్రమాదంలో వార్డు సభ్యుడు మృతి చెందాడు. భీమబోయినపాలెం గ్రామానికి చెందిన లాలం మణిబాబు(43) తన మనుమడు హర్ష(5)తో మాకవరపాలెం బైక్‌పై వచ్చాడు. తిరిగి బుధవారం రాత్రి స్వగ్రామం బయలుదేరాడు. అవంతి ఇంజినీరింగ్ కళాశాల వద్దకు వెళ్లేసరికి ఎదురుగా వస్తున్న మరో బైక్ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో మణిబాబు తలకు తీవ్రంగా గాయాలుకాగా, మనుమడు హర్ష కాలిపై గాయాలయ్యాయి. మరో బైక్‌పై వస్తున్న ఒకరికి గాయాలైనట్టు స్థానికులు తెలిపారు. వీరిని 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మణిబాబు మరణించాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు.

క్రికెట్ అభిమానులకు శుభవార్త

డిసెంబర్ 6న భారత్-దక్షిణాఫ్రికా వన్డే మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: విశాఖ క్రికెట్ అభిమానులకు బీసీసీఐ శుభవార్త చెప్పింది. దక్షిణాఫ్రికా జట్టు భారత్ పర్యటనలో భాగంగా రెండు టెస్ట్ మ్యాచ్‌లు, మూడు వన్డేలు, ఐదు టీ-20 మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్‌లో భాగంగా చివరిదైన మూడవ వన్డే మ్యాచ్ డిసెంబర్ 6న వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనుంది. విశాఖపట్నం ఇప్పటివరకు 11 వన్డేలకు ఆతిథ్యం ఇచ్చింది. అయితే దక్షిణాఫ్రికా ఈ వేదికపై మొదటిసారిగా వన్డే ఆడనుంది. అలాగే విశాఖ వేదికగా మూడు టెస్ట్ మ్యాచ్‌లు జరగ్గా.. ఒక టెస్ట్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఆడింది. ఇక్కడ జరిగిన ఆరు టీ-20 మ్యాచ్‌ల్లో ఒకసారి దక్షిణాఫ్రికా జట్టు భారత్‌తో తలపడింది.

రావిపాలెం నిర్వాసితులతో ఆర్డీవో భేటీ



బార్క్ నిర్వాసితుల సమస్యలు వింటున్న రెవెన్యూ అధికారులు

అచ్యుతాపురం రూరల్: బార్క్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి అనకాపల్లి ఆర్డీవో ఆయిషా ఆధ్వర్యంలో తంతడి, రావిపాలెం, దొప్పెర్ల గ్రామాల్లో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. డీ-పట్టా భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం రూ.20 లక్షలు పరిహారం ఇవ్వనున్నట్లు ఆర్డీవో తెలిపారు. జిరాయితీలో నివాస గృహాన్ని కోల్పోతున్న వారికి ప్రభుత్వ ఉన్నతాధికారులతో విచారణ జరిపి 5 సెంట్ల భూమి ఇవ్వడానికి ప్రయత్నం చేస్తామన్నారు. జెడ్పీటీసీ కో-ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ మాట్లాడుతూ రావిపాలెం నిర్వాసితులుగా గుర్తించి గ్రామాన్ని తరలించాలన్నారు. ఉమ్మడి అవసరాలకు 10 ఎకరాల స్థలం కేటాయించాలన్నారు. డీ-పట్టా భూములు కోల్పోయిన రైతులకు నక్కపల్లి మాదిరిగానే ఎకరాకు రూ.60 లక్షల పరిహారం ఇవ్వాలని, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి నిర్మాణం నిమిత్తం 5 సెంట్ల భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కె.వరహాలు, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్, రాజానపాలెం, తంతడి, దొప్పెర్ల, రావిపాలెం గ్రామాల నాయకులు, పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

33వ రోజుకు ఆర్టీసీ కార్మికుల దీక్షలు



ఆర్టీసీ డిపో ఎదుట రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

అనకాపల్లి టౌన్: తప్పుడు కేసులు పెట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎంయూఏ జోనల్ జాయింట్ కార్యదర్శి జి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట కండక్టర్, డ్రైవర్ల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 33వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1-2019 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ డిపో సెక్రటరీ పి.సుధాకర్, ఎం.రమణ, ఎస్.రావు, కె.ఎస్.రావు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

అనకాపల్లి టౌన్: స్థానిక నెహ్రూచౌక్ జంక్షన్‌లో ఉన్న నైస్ మెన్‌షవర్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెట్ సంస్థలో నిరుద్యోగ యువకులకు మల్టీ స్కిల్ టెక్నిషియన్, లాజిస్టిక్ కంప్యూటర్స్, ఇంగ్లిష్ ట్రేడ్‌లలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా మిషన్‌లో భాగంగా డీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం కింద ఇవ్వనున్న ఈ శిక్షణకు 10వ తరగతి, ఆ పైన ఉత్తీర్ణత కలిగి ఉండాలని పేర్కొన్నారు. 18-35 సంవత్సరాల యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 3 నెలల శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. పూర్తి వివరాలకు 70132 28982 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి పాలిసెట్-2025కు ఉచిత శిక్షణ

తుమ్మపాల: పాలిసెట్-2025 పరీక్షకు అనకాపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (రేబాక)లో బుధవారం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్ఎస్. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవజ్ఞులైన పాలిటెక్నిక్ అధ్యాపకులతో ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు కళాశాలలోని బ్లాక్-3లో తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల విద్యార్థులు ఫోన్ నంబర్లు 93988 48767, 89197 90483లలో సంప్రదించాలన్నారు.

సీపీఎం మహాసభలు విజయవంతం చేయాలి

అచ్యుతాపురం రూరల్ : తమిళనాడు రాష్ట్రం మధురైలో ఈ నెల 6న జరగనున్న సీపీఎం 24వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు కె.రామస దాశివరావు కోరారు. ఈ సందర్భంగా బుధవారం హరిపాలెంలో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మహాసభల్లో చర్చించనున్నట్టు చెప్పారు. పార్టీ నాయకులు కర్రి అప్పారావు, రొంగలి రాము, బుద్ధ రంగారావు, రామ్‌కుమార్, కూండ్రపు సోమునాయుడు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 3,935 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్టధర	గరిష్టధర
మొదటి రకం	3,520	4.310
రెండో రకం	3,210	3,800
మూడో రకం	2,850	3,200

అనకాపల్లి సినిమాలు

రాజా	:ట్రైలర్
సత్యనారాయణ స్క్రీన్-1	: రాబిన్‌హుడ్
పద్మిసాయి	: కోర్టు
షిర్డీసాయి	: ఎల్2: ఎంపురాన్ (లూజిఫర్-2)
వెంకటేశ్వర	: షణ్ముఖ
శ్రీసత్య	:సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర	: వీర ధీర శూర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 47 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-28 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషియన్ యూ.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 353 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

ఈసారీ కందిపప్పు లేదు..!



కశింకోటలో కోటా బియ్యం పంపిణీ

కోటాలో తప్పని కోతలు

బియ్యం, పంచదారకే రేషన్ పరిమితం

మూడు నెలలుగా ఇవ్వని కందిపప్పు

ఊసేలేని నూనె, గోధుమ పిండి, రాగుల పంపిణీ

కశింకోట: మండలంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా తెలుపు రంగు రేషన్ కార్డుదారులకు ఈ నెల కూడా బియ్యం, పంచదార మాత్రమే అందిస్తున్నారు. ఏప్రిల్ నెల రేషన్‌లో కంది పప్పుతో పాటు నూనె, గోధుమ పిండి, రాగులు, తదితర నిత్యావసర సరకులు అందుతాయని ఆశించిన లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పూర్తి స్థాయిలో నిత్యావసర వస్తువులు అందిస్తామని గతేడాది ఎన్నికల్లో రేషన్ కార్డుదారులకు హామీలు గుప్పించారు. తీరా షరామామూలుగా బియ్యం, పంచదార పంపిణీ చేస్తూ చేతులు దులుపుకొంటున్నారని లబ్ధిదారులు మండిపడుతున్నారు.

మండలంలో 21,354 మంది తెలుపు రంగు, ఏఏవై రేషన్ కార్డుదారులున్నారు. కార్డులో సభ్యుడు ఒక్కంటికి 5 కిలోల చొప్పున బియ్యం ఉచితంగాను, కార్డుపై అర కిలో పంచదార రూ.17కు అందిస్తున్నారు. ఏఏవై కార్డులకు 35 కిలోల బియ్యం అందిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బియ్యం, పంచదారతో పాటు తరచుగా కిలో కంది పప్పు, ఒక్కొక్కసారి గోధుమ పిండి, రాగులు కూడా సరఫరా చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దాదాపు బియ్యం, పంచదార పంపిణీకే పరిమితమయ్యారు. మూడు నెలల క్రితం, అంతకు ముందు ఒకసారి మాత్రం కంది పప్పు కిలో రూ.67కు రాయితీపై ఇచ్చారు. ఇక ఆ తర్వాత ఇవ్వడం లేదు. కిలో కందిపప్పు మార్కెట్‌లో ప్రస్తుతం కనీసం రూ.150 పైగా ధర పలుకుతోంది. అధిక శాతం పేదలైన తెలుపు రేషన్ కార్డుదారులు అంత ధరకు కందిపప్పు కొనుగోలు చేసి తినలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాయితీ ధరకు ప్రతి నెలా పోషకాహారంగా కందిపప్పు ఇస్తే బాగుంటుందని ప్రజలు ఆశిస్తున్నారు. కనీసం సంక్రాంతి, ఉగాది, రంజాన్ వంటి ప్రధాన పండగలను పురస్కరించుకుని అయినా కందిపప్పు పంపిణీ చేస్తారని లబ్ధిదారులు ఆశించారు. ఎన్నికల సమయంలో ప్రచారం కోసం నాయకులు ఆ మేరకు హామీలు గుప్పించడంపై ప్రజలు మండిపడుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికి అంటుతున్న తరుణంలో ప్రభుత్వం ఇప్పటికైనా కంది పప్పుతో పాటు గతంలో గోధుమ పిండి, గోధుమలు, రాగులు, తదితర సరకులను రాయితీపై ప్రతి నెలా సరఫరా చేయాలని కోరుతున్నారు.

రాయితీపై కందిపప్పు ఇవ్వాలి



కోటా కార్డులపై బియ్యం, పంచదార మాత్రమే అందిస్తున్నారు. మూడు నెలలుగా కంది పప్పు ఇవ్వడం లేదు. కందిపప్పు ధర ఆకాశాన్నంటడంతో కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. దీని దృష్ట్యా కంది పప్పును రాయితీపై అందించాలి.

– పెంటకోట సుబ్బారావు, కశింకోట

పేదలపై భారం తగ్గించాలి



నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోవడంతో కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. రేషన్ కార్డులపై బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, గోధుమలు, నూనె, రాగులు రాయితీపై అందించడానికి చర్యలు తీసుకోవాలి. పేదలపై ఆర్థిక భారం తగ్గించాలి.

– మళ్ల సరస్వతి, కశింకోట.

కందిపప్పు రాలేదు..

తెలుపు రేషన్‌కార్డులకు సంబంధించి ఈ నెల కందిపప్పు సరఫరా కాలేదు. దీంతో కార్డుదారులకు కందిపప్పు అందించడం లేదు. మండలంలో 21,354 మంది తెలుపు రంగు కార్డులు, ఏఏఎవై కార్డుదారులకు బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నాం.

– పి.సోమశేఖర్, పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్, కశింకోట

రెండో రోజుకు క్వారీ కార్మికుల సమ్మె



దర్జీనగర్‌లో వంటావార్పు కార్యక్రమంలో కార్మికులు

అనకాపల్లి: మండలంలోని వివిధ క్వారీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఆయా యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని నవయువ సమాఖ్య రాష్ట్ర కమిటీ సభ్యుడు నందారపు భాస్కర్ అన్నారు. మండలంలో బవులవాడ పంచాయతీ దర్జీనగర్ గ్రామంలో కార్మికులు రెండో రోజు బుధవారం కూడా సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండలను, బండలను కరిగించి యజమానులకు కోట్లాది రూపాయలు లాభాలు సంపాదించి పెడుతున్న కార్మికులకు కూలీ రేట్లు, జీతాలు పెంచకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాల విధానాలు యజమానులకు అనుకూలంగా ఉంటున్నాయని ఆరోపించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు యజమానులపై ఒత్తిడి తెచ్చి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వారీ క్రషర్స్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కోన మోహన్‌రావు, సంఘం నాయకులు శానాపతి అప్పలనాయుడు, చింతల రమేష్, ఎ.అప్పలనాయు డు, సిహెచ్.చిన్నారావు, చవితిన నూకరాజు, గొరపల్లి తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆటిజం పిల్లలపై ప్రత్యేక దృష్టి అవసరం



కొప్పాక భవిత కేంద్రంలో మాట్లాడుతున్న వరప్రసాద్



కశింకోటలోని భవిత కేంద్రంలో అవగాహన కలిగిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు



కశింకోటలో ఆటిజంపై అవగాహన ర్యాలీ

అనకాపల్లి: పిల్లల్లో ఆటిజం సమస్యను ముందుగా గుర్తించి జాగ్రత్తలు తీసుకుంటే ఫలితం ఉంటుందని అనకాపల్లి భవిత కేంద్రం మండల ప్రత్యేక ఉపాధ్యాయుడు బి.వి.వరప్రసాద్ అన్నారు. మండలంలో కొప్పాక భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ ఆటిజం దినోత్సవ వేడుకల్లో భాగంగా ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. జన్యుపరమైన లక్షణాలు, గర్భధారణ సమయంలో తల్లికి ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, పర్యావరణ ప్రభావాలు వంటి అంశాలు ఆటిజం సమస్యను ప్రభావితం చేసే కారణాలుగా పరిశోధనలు చూపుతున్నాయన్నారు. ప్రత్యేక విద్యా విధానాలు, శ్రద్ధాపూర్వక శిక్షణ, వ్యక్తిగత సంరక్షణ ద్వారా ఆటిజం బాధితులు ఎదుగుదల సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు యేసురత్నం, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: కశింకోటలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత కేంద్రంలో బుధవారం ఆటిజం దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆటిజం అనేది వ్యాధి కాదన్నారు. ఆటిజం అంటే న్యూరోలాజికల్ డెవలెప్‌మెంటు డిజార్డర్‌గా తెలిపారు. ఆటిజం రావడానికి జన్యుపరమైన కారణాలు కొన్ని ఉన్నప్పటికి కచ్చితమైన కారణాలు ఇంత వరకు ఎవరూ కనుగొనలేదన్నారు. ఈ కార్యక్రమంలో బాలికల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సిహెచ్.రామునాయుడు, భవిత ఉపాధ్యాయులు బి.వి.రమణమ్మ, ఎస్.దీప, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కూల్ పుస్తకాల స్టాక్ పాయింట్ పరిశీలన



స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న మాధవీలత, తదితరులు

అనకాపల్లి టౌన్: మండలంలోని కొండ కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్ భద్రపరిచే స్టాక్ పాయింట్‌ను రాష్ట్ర నేషనల్ టెక్స్ బుక్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.మాధవీలత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో క్లాస్, స్కూళ్ల వారీగా ఎంత మంది విద్యార్థులు ఉన్నారో పూర్తి వివరాలు సేకరించి, 2025-26 విద్యా సంవత్సరానికి స్టాక్ పాయింట్ నుంచి స్కూళ్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పుస్తకాలు, షూస్, బ్యాగులు, బెల్టులు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో-ఆర్డినేటర్ బి.కిషోర్ బాబు, మండల విద్యాశాఖాధికారి ఎస్.కోటేశ్వరరావు, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.ఎస్.సుమమని, సీఆర్పీ ఎస్.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

విత్తన గుళికల తయారీపై అవగాహన



జి.భీమవరంలో విత్తన గుళికల తయారీపై అవగాహన కల్పిస్తున్న రామగోవింద్, తదితరులు

కశింకోట: మండలంలోని జి.భీమవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే విత్తన గుళికల తయారీ, ఉపయోగాలపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ఎన్ఎఫ్ఏ రామగోవింద్ మాట్లాడుతూ విత్తన గుళికల తయారీకి బీజామృతం, చెరువు బంక మట్టి, ఘన జీవామృతం పొడి, కట్టెల బూడిద, నీరు, విత్తనాలు తీసుకోవాలన్నారు. ముందుగా విత్తనాలు బీజామృతంతో శుద్ధి చేసి అరగంట సేపు నీడలో ఆరబెట్టు కోవాలన్నారు. అనంతరం నార గోనె సంచిపై విత్తనాలు, బంకమట్టి, మంచినీళ్లు కలిపి ఆ మిశ్రమాన్ని బంతుల్లా ఉండలు తయారు చేయాలన్నారు. వాటికి ఘన జీవామృతం, నీళ్లు కలిపి బాగా పట్టించి బూడిద వేసి మరింత బాగా పట్టించాలన్నారు. వీటిని వర్షాధార భూమిలో ఈ నెల, వచ్చే మే నెలల్లో వేసుకుంటే వేసవిలో పడే కొద్ది పాటి వర్షాలకు తడిచి మొలకలు వస్తాయన్నారు. ఒకవేళ వర్షాలు పడటం ఆలస్యం అయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విత్తనాలకు పట్టి ఉన్న బంకమట్టి, ఘన జీవామృతం చెడిపోకుండా విత్తనాలు ఉండేలా ఉపకరిస్తాయన్నారు. వీటిని చీమలు, పక్షులు తినవన్నారు. వీటిని బీడు భూముల్లో కూడా సాగు చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంటీ కాయల దేవి, యూనిట్ ఇన్‌ఛార్జిలు డి.రమణ, డీఆర్‌పీ సతీష్, డి.వెంకటలక్ష్మి, మెగా ప్రకృతి వనరుల కేంద్రం నిర్వాహకురాలు కూండ్రపు అరుణ, ఐసీఆర్‌పీలు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలి



పి.కె.పల్లిలో జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కోసం ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కోటవురట్ల: రైతు సేవా కేంద్రాల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేసి జీడి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. పి.కె.పల్లి గ్రామ సచివాలయం వద్ద బుధవారం రైతులతో కలిసి సీపీఎం నాయకులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అప్పలరాజు మాట్లాడుతూ పొగమంచు కారణంగా జీడిరైతుకు అపార నష్టం వాటిల్లిందన్నారు. పూత నుంచి పిందె నిలబడేంత వరకు రైతులు అప్పులు చేసి పెట్టుబడి పెట్టారని, పెట్టుబడి డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదని, ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలన్నారు. దీనికి తోడు జీడిపిక్కల వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారి దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో 80 కిలోల బస్తాకు రూ.16 వేలు చెల్లించి ప్రభుత్వమే రైతుల నుంచి జీడిపిక్కలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు ఉచితంగా బీమా సౌకర్యం కల్పించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. అనంతరం సచివాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్, ఎస్.కొండబాబు, పోతురాజు, దేవా పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికావొద్దు



వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న మంగమ్మ

అనకాపల్లి: వేసవిని దృష్టిలో పెట్టుకుని వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు దృష్టి సారించాలని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ బి.మంగమ్మ సూచించారు. మండలంలో మార్టూరు గ్రామంలో వడదెబ్బపై బుధవారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని ఉదయం 10 గంటలలోపు, సాయంత్రం 3 గంటల తరువాత బయటకు వెళ్లాలని కోరారు. అత్యవసర సమయంలో బయటకు వెళ్తే గొడుగు, తాగునీటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్స్, ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి



ముషిడిపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

దేవరాపల్లి : ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు సంబంధించిన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఉపాధి కూలీలు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు ముషిడిపల్లి,కాశీపురం గ్రామాలలో బుధవారం ఉపాధి కూలీలు నిరసన వ్యక్తం చేశారు. సుమారు 9 వారాలుగా కూలీ సొమ్ము అందించకపోవడంపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. రెక్కాడితే డొక్కాడని తామంతా ఉపాధి కూలీ సొమ్ముపైనే ఆధారపడి జీవిస్తున్నామని, 9 నెలలుగా కూలీ సొమ్ము చెల్లించక పోతే ఏం తిని బతకాలని తీవ్రంగా మండిపడ్డారు. చట్ట ప్రకారం సకాలంలో బకాయిలు చెల్లించని ప్రభుత్వంపై ఎందుకు కేసులు పెట్టకూడదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల ఆందోళన కార్యక్రమానికి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వెంకన్న మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రూ. 52 కోట్ల బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాదిలో చేపట్టే పనులకు రూ.7 పెంచి ఉపాధి కూలీలు పండగ చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. మండుటెండలో పని చేస్తున్న కూలీలకు ప్రభుత్వం టెంట్ సౌకర్యం కల్పించలేని స్థితిలో ఉందన్నారు. గత ప్రభుత్వంలో గునపం, తట్ట, పార, తాగునీరు, ట్రావిలింగ్ అలెవెన్స్‌లు ఇచ్చేవారని, ఇవన్నీ కట్ చేసి ఈ ప్రభుత్వం రూ.7 పెంచినట్టు గొప్పగా ప్రచారం చేసుకోవడం అన్యాయమన్నారు. తక్షణమే బకాయిలు చెల్లించుకుంటే ఉపాధి కూలీలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఖరీఫ్ పంటకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రావు

పాయకరావుపేట: రైతులందరూ ఖరీఫ్ పంట కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి.మోహన్‌రావు సూచించరాఉ. ఆయన పట్టణంలోని వ్యవసాయ శాఖా కార్యాలయంలో 5 మండలాల వ్యవసాయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అవకాశం ఉన్న చోట అపరాలు, నువ్వులు, రాగులు పండించే విధంగా రైతుల్ని ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు రాయితీలపై పరికరాలు, విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు రాజ్‌కమాల్, ఆదినారాయణ, ఉమా ప్రసాద్, సరోజిని, చిరంజీవిరావు, ఏఈవోలు, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీలకు జరిమానా

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా అధిక లోడుతో వెళ్తున్న మూడు లారీలకు జరిమానా విధించినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. పూడిమడక రోడ్డులో మంగళవారం రాత్రి మునగపాక జంక్షన్ వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా అధిక లోడుతో బండరాళ్లను తరలిస్తున్న మూడు లారీలను పట్టుకొని కేసు నమోదు చేసి, రూ.96 వేల జరిమానా విధించామన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా అధిక లోడుతో బండరాళ్లను తరలిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తామన్నారు.

కార్పొరేట్ మోజులో పడొద్దు..



కోటవురట్లలో ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరుతున్న అధ్యాపకులు

కోటవురట్ల: ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు విద్యార్థుల ఇంటిబాట పట్టారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యతతో కూడిన విద్యను ఉచితంగా అందిస్తున్నామని, మీ పిల్లలను చేర్పాలని తల్లిదండ్రులను అభ్యర్థించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు బుధవారం ఇంటింటా ప్రచారం చేశారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ కళాశాలలో చేర్పాలని కోరారు. కరపత్రాలు పంచి ఆహ్లాద వాతావరణంలో విద్యాబోధన చేస్తున్నామని, పిల్లల బంగారు భవిత కోసం చేర్పాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ కళాశాలల మోజులో పడి అప్పులపాలవ్వద్దని సూచించారు.

ఎర్ర బ్యాడ్జీలతో నిరసన

నర్సీపట్నం : ఆర్టీసీ ఉద్యోగులు రెడ్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఎన్ఎంయుఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ డిపో ఉద్యోగులు బుధవారం రెడ్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 2019 ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు చేయాలని డిపో గేటు వద్ద ఉద్యోగులు నిరసన తెలియజేశారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

అచ్యుతాపురం రూరల్ : బాలల సంరక్షణ అందరి బాధ్యత అని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ క్షేత్ర స్థాయి సభ్యురాలు కె.ఎల్.వి.రమ్య అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమంపై బుధవారం మళ్ళవరం, ఎం.జగన్నాథపురం గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, చిన్న పిల్లలతో పనులు చేయించడం, భిక్షాటనపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అటువంటి పిల్లలు ఎక్కడైనా తారసపడితే వెంటనే హెల్ప్ లైన్ నంబర్ 1098, 112కు ఫోన్ చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో మహిళా కానిస్టేబుల్ ఆధ్వర్యంలో సర్పంచ్ అధ్యక్షుడిగా ఉండి మరో 9 మందితో కూడిన కమిటీ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మళ్ళవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు, ఎం.జగన్నాథపురం సర్పంచ్ కొరెడ్ల బుల్లెమ్మ, మాజీ సర్పంచ్ కొరెడ్ల సూర్య ప్రకాష్, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సాంకేతికత దేశాభివృద్ధికి తోడ్పడాలి



మాట్లాడుతున్న న్యాయ విద్యాలయం ఉపకులపతి సూర్యప్రకాశరావు

మాకవరపాలెం: సాంకేతికత దేశాభివృద్ధికి తోడ్పడేలా ఉండాలని దామోదరం సంజీవయ్య న్యాయ విద్యాలయ ఉపకులపతి డి.సూర్యప్రకాశరావు విద్యార్థులకు సూచించారు. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం టెక్ వైబ్ పేరుతో 25వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతను దుర్వినియోగం చేయకుండా దేశాభివృద్ధికి ఉపయోగపడేలా విద్యార్థులు నడుచుకోవాలన్నారు. విజయనగరం జెఎన్‌టీయు సిఎస్‌సి హెచ్‌వోడి బిందు మాధవి మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో సృజనాత్మకత, నైతిక విలువలతో విజయాలను సొంతం చేసుకోవచ్చన్నారు. విశాఖ ఎస్ఎస్‌టీఎల్ అసోసియేట్ డైరెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ అపజయాలతోనే విజయాలను పొందొచ్చన్న ప్రముఖుల మాటలను గుర్తు చేశారు. కళాశాల వ్యవస్థాపకుడు ఎం.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు తదితరులు ప్రసంగించారు. వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

రీ-సర్వేతో రైతులకు మేలు



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

మునగపాక: రీ-సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని టి.సిరసపల్లిలో బుధవారం రీ-సర్వేను ఆయన ప్రారంభించారు. ముందుగా రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన రీ-సర్వేలో లోపాలను సవరించడంతో పాటు రైతుల రికార్డుల పరిశీలన జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, రీ-సర్వే డీటీ పడాల్, బాలు, నవీన్, వీర్వో తరుణ్, పంచాయతీ కార్యదర్శి హేమకుమారి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.